క్లుప్తంగా

నేడు దుర్గమాంబ పండగ



పరవాడ: రావాడ శివారు ధర్మారాయుడుపేటలో కొలువైన దుర్గమాంబ పండగను గురువారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఉత్సవ కమిటీ తెలిపింది. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు దర్శించుకుని, పసుపు కుంకుమలు సమర్పించుకునేందుకు అనువైన వసతులు కల్పించామన్నారు. ఉచిత ప్రసాదం అందిస్తామన్నారు. రాత్రికి అమ్మవారిని డప్పులు, సాముగరిడీలు, కోయడ్యాన్సులు, చిడతలు, తప్పెటగుళ్ల వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో పురవీధుల్లో ఊరేగించి, భారీ బాణసంచా వెలుగుల మధ్య అనుపు మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనుల్ని పరిశీలించిన ఎంపీడీవో



కూలీల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: మండలంలోని బాటజంగాలపాలెం, నారపాడు గ్రామాల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపడుతున్న పనులను ఎంపీడీవో పద్మజ బుధవారం పరిశీలించారు. బాటజంగాలపాలెంలో ఏర్పాటు చేసిన పశువుల తొట్టెలు, పల్లె వనం, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి మన మిత్ర సర్వే తీరును పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నారపాడులో చేపడుతున్న చేపల కందకాల పనులను పరిశీలించారు. ఉపాధి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఫీల్డ్ అసిస్టెంట్లు పి.సన్యాసిరావు, పి.సంతోషి, డి.రామకృష్ణ తదితరులు ఉన్నారు.

చంద్రశేఖర్‌రెడ్డికి ఉగాది నంది పురస్కారం



ఉగాది నంది పురస్కారం స్వీకరిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

పెందుర్తి: ఆధ్యాత్మిక, సేవా రంగంలో కృషి చేస్తున్న సుజాతనగర్ పూర్ణ పుష్కళ సమేత శ్రీధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డికి ఉగాది నంది పురస్కారం లభించింది. హైదరాబాద్‌కు చెందిన ఉజ్వల సాంస్కృతిక సామాజిక స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ గత రెండు దశాబ్దాలుగా అయ్యప్ప సేవా ట్రస్ట్ తరపున నిర్వహించిన అనేక సేవా కార్యక్రమాలకు లభించిన గౌరవంగా పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడతామన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు వెంకటాపురం ఎస్సీ బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ పక్షోత్సవాలు నిర్వహించారు. వెంకటాపురం తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ జరిపారు. పక్షం రోజుల్లో 1000 రోజుల సంరక్షణ, పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం, తల్లి పాలే బిడ్డకు అమృతం వంటి పలు అంశాల గురించి గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జ్యోతి, ఎంఎస్‌కే దివ్య, సూర్యకళ, శమంతకమణి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంకటహర చతుర్థి పూజలు



నడుపూరులోని గణపతి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పెదగంట్యాడ: నడుపూరులోని సంకట మోచన గణపతి దేవాలయంలో బుధవారం సంకటహర చతుర్థి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మంత్రి నరసింహమూర్తి, జయంతి ఆధ్వర్యంలో వేద పండితుల శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని సంకట విమోచన గణపతిని దర్శించుకున్నారు.

చిరుధాన్యాలతో.. ఆరోగ్య సిరి





మారుతున్న కాలం.. అధికాదాయం వైపు పరుగులు.. ఈ క్రమంలో ఆహార సమయపాలన గాడి తప్పుతోంది. దీంతో అందుబాటులో ఉన్న ఫాస్ట్ ఫుడ్ లాగించేస్తున్నారు. కట్ చేస్తే యుక్త వయసులోనే బీపీ, సుగర్, ఊబకాయం, గ్యాస్ట్రిక్ తదితర సమస్యలతో పాటు గుండె సంబంధిత ఇబ్బందులు వేధిస్తున్నాయి. దీంతో ప్రజలు పాత ఆహారపు అలవాట్ల వైపు మొగ్గు చూపుతున్నారు. చిరు ధాన్యాలకు గిరాకీ పెరుగుతోంది. ఏటేటా నియోజకవర్గ పరిధిలో పెరుగుతున్న వీటి సాగు విస్తీర్ణమే నిదర్శనం.

- పెరుగుతున్న చిరు ధాన్యాల వినియోగం, సాగు
- రాగులు, కొర్రలు, ఊదలు, సజ్జలు, జొన్నలకు గిరాకీ
- మిల్లెట్స్ ఆహార పదార్థాలపై మక్కువ
- రైతులకు ఆదాయం.. ప్రజలకు ఆరోగ్యం

పెందుర్తి:

మారుతున్న కాలానికి అనుగుణంగా.. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే పాత తరం ఆహారపదార్థాలే శరణ్యమని నిపుణులు చెప్పున్నారు. ఓ వయసుకు చేరిన వారు ఫాస్ట్ ఫుడ్‌తోపాటు, వరి అన్నం తీసుకోవడాన్ని తగ్గించేస్తున్నారు. వీటి స్థానంలో చిరు ధాన్యాలైన రాగులు, ఊదలు, కొర్రలు, అరికలు, సామలు, జొన్నల వంటి వాటిపై ఆసక్తి కనబరుస్తున్నారు. దైనందిన భోజనంలో వీటి ప్రాధాన్యతను పెంచుతున్నారు. ఈ నేపథ్యంలో చిరు ధాన్యాల పంటలకు రైతులు కూడా సిద్ధమవుతున్నారు. ఇటు రైతులకు మంచి ఆదాయం.. అటు ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యానికి చిరుధాన్యాలే మేటి అన్న నమ్మకం పెరుగుతోంది.

పెరుగుతున్న సాగు విస్తీర్ణం

ప్రజల అవసరాలకు.. ఆసక్తికి అనుగుణంగా నియోజకవర్గంలోని రైతులు కూడా చిరు ధాన్యాల పంటల వైపు ఇటీవల కాలంలో మొగ్గు చూపుతున్నారు. గతంలో 100 ఎకరాల లోపు ఉండే చిరుధాన్యాల సాగు ప్రస్తుతం దాదాపు 500 ఎకరాల వరకు విస్తరించింది. ఖరీఫ్ కంటే రబీ సీజన్‌లోనే వీటి సాగుకు వాతావరణం అనుకూలం. ఈ పంటలు నీటి ఎద్దడిని తట్టుకుంటాయి. కాబట్టి ప్రస్తుతం రైతాంగం ఈ పంటలు వేసేందుకు సన్నద్ధమవుతున్నారు.



ఆదాయం బాగుంది



మా ప్రాంతంలో కూరగాయల పంటలు అధికంగా వేస్తాం. అయితే ఇటీవల కాలంలో చిరుధాన్యాలైన రాగులు, గంటెల సాగుపై దృష్టి పెట్టాం. చిరుధాన్యాల సాగు మొదలెట్టాక దిగుబడి, ఆదాయం రెండూ బాగున్నాయి. కొంతమంది వినియోగదారులు నేరుగా మా వద్దకు వచ్చి రాగులు కొనుగోలు చేసి పట్టుకెళ్తున్నారు.

– బోకం శ్రీనివాసరావు, తవ్వవానిపాలెం

మంచి గిరాకీ ఉంటుంది



మిల్లెట్స్ ఉపయోగాలను తెలుసుకున్న తరువాత ప్రజల ఆసక్తిని గమనించి చిరు ధాన్యాల వ్యాపారం ప్రారంభించాం. తొలుత కాస్త అటూఇటుగా ఉన్నా.. ప్రస్తుతం ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారు. వారికి కావాల్సిన అన్ని మిల్లెట్స్ అందుబాటులో ఉంచుతున్నాం. చాలా మంది బల్క్‌గా తీసుకుని వెళుతున్నారు.

– మాలిరెడ్డి బలరాం, చిరు ధాన్యాల దుకాణ నిర్వాహకుడు, సబ్బవరం

చిరు ధాన్యాలు ఎంతో మేలు



ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఫాస్ట్‌ఫుడ్‌కు పిల్లలు, పెద్దలు దూరంగా ఉండాలి. నూనెలు, మసాలాలతో ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. రాగి సంకటి, జావ, జొన్న రొట్టెలు, కొర్రల అన్నం వంటి పదార్థాల వలన మనిషి శరీరానికి ఎంతో మేలు. మధుమేహం, ఊబకాయం, రక్తపోటును ఇవి చాలా వరకు నియంత్రిస్తాయి.

– డాక్టర్ ఎంవీఈ రామానాయుడు, ఫిజీషియన్

ప్రోత్సహిస్తున్నాం



చిరు ధాన్యాల వినియోగం రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆయా పంటలు వేసేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నాం. వరితో పోల్చుకుంటే చిరు ధాన్యాల సాగుకు వ్యయప్రయాసలు తక్కువ. నీరు అధికంగా ఉండాల్సిన అవసరం లేదు. రైతులకు మంచి దిగుబడి వస్తే ఆదాయం కూడా అలాగే ఉంటుంది.

– టి.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారి, పెందుర్తి

ఆరోగ్య 'సిరి'ధాన్యాలు

చిరుధాన్యాల్లో లభించే పోషకాలు ఆ స్థాయిలో మరెందులోనూ ఉండవని ఆరోగ్య నిపుణులు చెప్పున్నారు. ఏయే చిరు ధాన్యాలతో ఏయే ప్రయోజనాలున్నాయంటే..

కొర్రలు: రోగ కారక గుణాలు ఉండవు. కొర్రలు నిత్యం తీసుకుంటే శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. దీంతోపాటు కండరాలు పటిష్టంగా మారుతాయి. శ్వాసకోశ వ్యాధులను నివారిస్తుంది. ఎముకల్లో శక్తి పెరుగుతుంది.

రాగులు: అంబలి రోజూ ఉదయం పూట తాగితే జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. శరీరానికి చల్లదనం వస్తుంది. శారీరక దృఢత్వం కలుగుతుంది. రాగి పిండి, బెల్లం కలిపి కట్టెల పొయ్యిపై కాల్చిన అట్టు(సక్కులు) తింటే రక్తం వృద్ధి చెంది రక్త ప్రసరణ చురుగ్గా ఉంటుంది.

అరికెలు: రక్తంలో ఎర్రరక్త కణాలు పెంచుతాయి. రక్తాన్ని శుద్ధి చేసే శక్తి వీటికి ఉంది.

సామలు: తరచూ తీసుకుంటే మగవారి వీర్య వృద్ధి చెందుతుంది. మహిళల్లో ఓపీసీడీ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. గైనిక్ సమస్యలు తొలగిస్తుంది.

ఊదలు: వలన ఊపిరి తిత్తులు, కాలేయం, గుండె తదితర ప్రధాన అవయవాలను శుభ్రం చేసే తత్వం ఉంది.

అండు కొర్రలు: చిరు ధాన్యాల్లో రారాజు. రోజు విడిచి రోజు దీన్ని ఆహారంగా తీసుకుంటే ఆపాదమస్తకం మనిషికి ఉపయోగం. శరీరంలో ఎక్కడ చెడు ఉన్నా సహజ సిద్ధంగా పూర్తిగా తొలగిస్తుంది. థైరాయిడ్‌ను నియంత్రించేందుకు ఇవి ఎంతో మేలు చేస్తాయి.

సజ్జలు: వరి ధాన్యంలో సజ్జలు కలిపి అన్నం వండి తింటే శరీరంలో ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది. జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. చద్ది అన్నంగా పల్లెల్లో ఇది ప్రత్యేకం.

జొన్నలు: మధుమేహానికి చాలా మంచిది. జొన్న రొట్టెలు తినడం వలన సుగర్‌ను పూర్తిగా అదుపులో ఉంచుతుంది.

సైన్స్ ప్రాజెక్టుల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు

సబ్బవరం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులకు ప్రశంసలు లభించాయని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ బుధవారం తెలిపారు. టీసీఎస్ ఆధ్వర్యంలో గో–ఐటీ డిజిటల్ ఇన్నోవేషన్, కెరీర్ రెడీనెస్ ప్రోగ్రాంకు 8వ తరగతి విద్యార్థులు డి.విశ్వనాథ్, ఎల్.మున్నా, ఎం.అశోక్, జై నిశాల్, 9వ తరగతి విద్యార్థులు కె.యోగేంద్ర, జె.సందీప్‌లు డెవలప్ చేసి పంపించిన పృథ్వి యాప్ ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. విప్రో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన విప్రో ఎర్తియన్‌కు ఎం.ధనుంజయ్, డి.విశ్వనాథ్, కె.శ్రీను, పి.ప్రవీణ్ కుమార్, డి.ధర్మతేజ పంపిన ప్రాజెక్టు ప్రశంసా పత్రాన్ని దక్కించుకుందన్నారు. గైడ్ టీచర్స్ టి.రాంబాబు, జి.జానకిరామ్‌తోపాటు, విద్యార్థులను ప్రిన్సిపాల్ రామకృష్ణ, జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ సి.ప్రభావతమ్మ అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.చిరంజీవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉపాధి' క్షేత్ర సహాయకుల సమ్మె నోటీస్



ఎంపీడీవోకు సమ్మె నోటీస్ అందిస్తున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ క్షేత్ర సహాయకులు

- 21న ఒక్క రోజు సమ్మె,
- 28 నుంచి పూర్తి విధుల బహిష్కరణ

సబ్బవరం: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేకుంటే సమ్మెకు దిగుతామంటూ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు హెచ్చరించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పద్మజను కలిసి, సమ్మె నోటీస్ అందించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ తమ 19 సంవత్సరాల సర్వీస్‌ను పరిగణనలోకి తీసుకుని, గ్రామ పంచాయతీ ఉద్యోగులు గుర్తించి, క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని అంతర్గత బదిలీలు చేయడం ద్వారా స్థానిక ఒత్తిడిలను అధిగమించి, మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. విధి నిర్వాహణలో మరణించిన ఫీల్డ్ అసిస్టెంట్‌ల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించి, రూ.10 లక్షలు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాల పెంపు, విద్యార్హతల అధారంగా పదోన్నతులు కల్పించాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రభుత్వం తమ సమస్యలపై సానుకూలంగా స్పందించి, పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమ్మెలో భాగంగా బుధవారం నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరైనట్లు తెలిపారు. ఈ నెల 21న ఒక్కరోజు పూర్తిగా పనులు నిలిపివేసి పెన్ డౌన్ చేయడంతోపాటు, కలెక్టర్‌కు సమ్మె విషయం తెలుపుతూ, తమ సమస్యలపై వినతి పత్రం అందిస్తామన్నారు. ఈ నెల 28 నుంచి విధులను పూర్తిగా బహిష్కరించి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు పేర్కొన్నారు. ఎంపీడీవోకు సమ్మె నోటీస్ అందించిన వారిలో మండల క్షేత్ర సహాయకుల సంఘం నాయకులు ఆర్.సన్యాసిరావు, పి.సంతోషి, డి.రామకృష్ణ, జి.భారతి, ఎస్.లోకేష్, జి.దేవి, ఇ.హైమావతి తదితరులు ఉన్నారు.

నాటక రంగాన్ని బతికించుకుందాం



మాట్లాడుతున్న ఆచార్య నరసింహారావు



గోపాత్రుడు నాటికలోని ఓ సన్నివేశం

విశాఖ విద్య: నాటక రంగాన్ని బతికించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు అన్నారు. కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా బుధవారం ఏయూ ఓపెన్ థియేటర్‌లో తెలుగు నాటకం దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కందుకూరి చిత్రపటానికి వర్సిటీ ఆచార్యులతో కలసి నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరేశలింగం జయంతిని నాటక రంగ దినోత్సవంగా ప్రకటించడం నాటక రంగానికి గుర్తింపు దక్కినట్లేనన్నారు. కళలకు పుట్టినిల్లు ఉత్తరాంధ్రలో నాటక రంగానికి నేటికీ మంచి ఆదరణ లభిస్తోందన్నారు. టెక్నాలజీ ఎంత పెరిగినా.. సమాజం ఉన్నంత వరకు నాటకం బతికే ఉంటుందని పేర్కొన్నారు. సమాజ ఇతివృత్తాలను కళ్లకు కట్టినట్లుగా చూపించే అవకాశం ఒక్క నాటక రంగంలోనే ఉంటుందని చెప్పారు. ఆంధ్రా యూనివర్సిటీలో థియేటర్ ఆర్ట్స్ విభాగానికి పూర్వ వైభవం తీసుకొచ్చేలా తగిన ప్రణాళికలు తయారు చేస్తున్నామని తెలిపారు. అనంతరం ప్రదర్శించిన గోపాత్రుడు నాటిక ఆకట్టుకుంది. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.శశిభూషణ్‌రావు, ఆచార్య ప్రేమనందం, ఆచార్య విజయ్‌మోహన్, ఆచార్య పల్లవి, డైరెక్టర్ డా.కిరణ్‌కుమార్, డా.రాజేంద్రప్రసాద్, పితాని ప్రసాద్, డా.వీర్‌కుమార్, హేమ వెంకటేశ్వరి, దుర్గారావు, సాయిప్రియ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి పరవాడ ప్రాంత సమస్యలు



జిల్లా పరిషత్ సమావేశంలో పరవాడ జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు

పరవాడ: ఫార్మాసిటీలో తరచూ చోటుచేసుకుంటున్న ప్రమాదాలను నివారించేందుకు ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టాలని పరవాడ జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో ఆయన పాల్గొని పరవాడ ప్రాంత ప్రజల సమస్యలను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. ఫార్మా పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యంతో అనేక గ్రామాల ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత వేసవిలో పలు గ్రామాల్లో నెలకొన్న నీటి ఎద్దడి, పీహెచ్‌సీల్లో స్పెషలిస్టు వైద్యులు లేక ప్రజలు పడుతున్న అవస్థలను వివరించారు. పీహెచ్‌సీలకు ప్రత్యేక వైద్యులను నియమించాలని కలెక్టర్‌ను కోరారు.

అప్రమత్తతతో అగ్నిప్రమాదాలకు చెక్



పెదగంట్యాడలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక దళ సిబ్బంది

పెదగంట్యాడ: అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలు అరికట్టవచ్చునని అగ్నిమాపక జిల్లా అధికారి ఎస్.గోపీకృష్ణ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పెదగంట్యాడ, గాజువాక పరిసర ప్రాంతాల్లో అగ్ని మాపక దళ సిబ్బందితో కలసి బుధవారం ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజాగ్రత్త వల్లే అగ్ని ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు ఎలా నివారించాలనే అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాంటి సమయంలో ఆస్తి నష్టం, ప్రాణనష్టం వాటిల్లకుండా సకాలంలో సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రమాదాలు సంభవించినపుడు మంటలను ఏ విధంగా అదుపుచేస్తారో ప్రయోగాత్మకంగా ప్రదర్శన ద్వారా తెలియజేశారు.

'తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలి'



నిరసన ప్రదర్శనలో సిటు నాయకులు

పరవాడ: కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించి, అక్కడి ప్రజలను ఆదుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సిటు ఆధ్వర్యంలో తాడి గ్రామంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి కాలుష్యంలో చిక్కుకుని అల్లాడుతున్న తాడి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలిస్తామని రాజకీయ నాయకులు హామీలు గుప్పించడమే తప్ప, తరలించే ప్రక్రియను ప్రారంభించకపోవడం విచారకరమన్నారు. వెంటనే గ్రామంలో రీ సర్వే జరిపి, మేజర్లయిన పిల్లలు, పక్కా భవనాలను లెక్కించి, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భవనాలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కాలుష్యం వలన గ్రామంలోని ప్రజలు అనేక ఆనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. తాడి, తాడి కాలనీ, పెదతాడి గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి గ్రామాన్ని సురక్షిత ప్రదేశానికి తరలించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కండేపల్లి అప్పలరాజు, పితాని సన్యాసిరావు, పెంటయ్య, కనకరావు పాల్గొన్నారు.

విద్యుత్, వంట గ్యాస్ ప్రమాదాలపై అవగాహన



సాయినగర్ కాలనీలో అగ్నిప్రమాద నియంత్రణపై డెమో నిర్వహిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

సబ్బవరం: నివాసాలలో విద్యుత్, వంట గ్యాస్ కారణంగా జరిగే అగ్ని ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానిక అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు తెలిపారు. మండల కేంద్రం సబ్బవరం సాయినగర్ కాలనీలో గృహ సంబంధ అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం వివరించారు. అగ్నిమాపక విభాగం రూపొందించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

వంట గ్యాస్ ప్రమాదాల్లో మంటల్ని అదుపు చేయడంపై డెమో నిర్వహించారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ పి.శివ ప్రసాద్, సిబ్బంది పి.అప్పారావు, కె.మహేశ్వరరావు, బి.ఉదయ్ కుమార్, ఎం.సత్తిబాబు, ఎం.శివ తదితరులు పాల్గొన్నారు.

జియో సింథటిక్స్‌తో బహుళ ప్రయోజనాలు



సదస్సు ప్రారంభిస్తున్న వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్

విశాఖ విద్య: జియో సింథటిక్స్ బహుళ ప్రయోజనకరంగా నిలుస్తున్నాయని వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ఎం.వినయ్‌కుమార్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో బుధవారం నిర్వహించిన ఒకరోజు సదస్సును ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానవ మేధస్సు నుంచి జియో సింథటిక్స్ ఉద్భవించిందని, మూడు శతాబ్దాలుగా దీని ప్రాముఖ్యత పెరుగుతూ వస్తోందన్నారు. విశాఖలో చేపట్టిన తొలి ఫ్లైఓవర్ నిర్మాణంలో కూడా జియో సింథటిక్స్ వినియోగించామని చెప్పారు. యువ ఇంజినీర్లు ఈ రంగాన్ని తమ కెరీర్‌గా మలచుకోవడానికి సదస్సు ఎంతో ఉపయోగంగా నిలుస్తుందన్నారు. నిపుణులు సుస్థిర పరిష్కారాలను అందించాలని సూచించారు. మెకఫెరి సంస్థ బిజినెస్ హెడ్ గిన్లుకా స్పాడారో, ఏయూ సివిల్ ఇంజినీరింగ్ ఆచార్యుడు సి.ఎస్.వి.సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విశాఖ విమానాశ్రయం రన్‌వే పటిష్టతకు, ఇతర ప్రాంతాల్లో బహుళ నిర్మాణాలు చేపట్టడానికి జియో సింథటిక్ మెటీరియల్స్‌ను వినియోగించామని తెలిపారు. అనంతరం పోర్టుల నిర్మాణం, నేల కోత నివారణ, జాతీయ రహదారులపై డ్రైనేజీల నిర్మాణం, జియో సింథటిక్స్ ఉపయోగించడం వల్ల కలిగే ప్రయోజనం, వివిధ ప్రాంతాల్లో జియో సింథటిక్స్ నిర్మాణాలు–వాటి ప్రాముఖ్యతలు, రైల్వే లైన్ ఎయిర్‌పోర్ట్ రన్‌వేల నిర్మాణంలో జియో సింథటిక్ వినియోగం, ఉపయోగాలు తదితర అంశాలపై నిపుణులు ప్రసంగించారు. సదస్సులో పరిశ్రమల నిపుణులు, సివిల్ ఇంజినీరింగ్ ఆచార్యులు వివిధ కళాశాల ఆచార్యులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌దే భవిష్యత్తు



ఏయూ ఆచార్యులతో రిజిస్ట్రార్ ధనుంజయరావు

విశాఖ విద్య: భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) ఆధారంగా నడుస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు పేర్కొన్నారు. ఏయూ కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం సంయుక్తంగా బుధవారం నిర్వహించిన బిల్డ్ భారత్ హ్యాక్‌థాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. యువత మేధస్సుకు పదును పెట్టే విధంగా ఈ కార్యక్రమం నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సృజనాత్మకంగా పనిచేస్తూ నూతన ఆవిష్కరణలు జరపాలని సూచించారు. యువత ఇక్కడ నుంచి స్ఫూర్తిని పొంది నూతన అంకుర సంస్థలను స్థాపించేలా అడుగులు వేయాలన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య కె.వెంకటరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఏడు రాష్ట్రాల నుంచి 488 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. యువతను ప్రోత్సహించడం, వారి ఆలోచనల నుంచి అనేక సమాజ ఉపయుక్త పరిష్కారాలను తీసుకురావడం కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యులు పాల్గొన్నారు.